పూడికతీత పేరిట స్వాహా

- ఇప్పటికే రెండుసార్లు నిర్వహణ
- మరోసారి చేపట్టేందుకు సన్నాహాలు
- రూ.ఐదు లక్షలు కొల్లగొట్టేందుకు స్కెచ్
- మున్సిపల్ శాఖ మంత్రి ఇలాకాలోనే దోపిడీ

నెల్లూరు(బారకాసు): చేసిన పనులనే మళ్లీ.. మళ్లీ నిర్వహిస్తూ నిధులు కొల్లగొట్టే ప్రక్రియకు కార్పొరేషన్ అధికారులు రంగం సిద్ధం చేశారు. కాలువ పూడికతీత పనుల పేరిట ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. నగరంలోని 17వ డివిజన్లో గల ఓ ఇరిగేషన్ కాలువలో నెల వ్యవధిలో రెండుసార్లు రూ.లక్షలు వెచ్చించి పూడిక తీశారు. తాజాగా మరోసారి ఇదే కాలువలో చేపట్టేందుకు సిద్ధమయ్యారు. మున్సిపల్ శాఖ మంత్రి ఇలాకాలో ఈ తరహాలో నిధులను నగరపాలక సంస్థ అధికారులు దోచేస్తుండటం గమనార్హం.

వరంగా మారిన పనులు

కాలువల పూడికతీత పనులు కొందరు కాంట్రాక్టర్లకు వరంలా మారాయి. పనులు చేయకుండానే బిల్లులు పెట్టుకొని నిధులు స్వాహా చేస్తున్న ఉదంతాలూ చాలానే ఉన్నాయి. వాస్తవానికి వర్షాలు కురవనున్న నేపథ్యంలో రూ.1.37 కోట్లను వెచ్చించి నెల్లూరు నగర నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో గల కాలువల్లో పూడికతీత పనులను మూడు నెలల క్రితం చేపట్టారు. 17వ డివిజన్ పరిధిలోని చిల్డ్రన్స్ పార్కు సమీపంలో గల జెట్టి శేషారెడ్డి భవనం నుంచి జాతీయ రహదారి వరకు దాదాపు అర కిలోమీటర్ మేర ఇరిగేషన్ కాలువ ఉంది. ఈ కాలువను శుభ్రం చేసే బాధ్యతను నెల్లూరు కార్పొరేషన్‌కు సదరు శాఖ అధికారులు ఎప్పుడో అప్పజెప్పారు.



అక్టోబర్ 14న చేపట్టిన పూడికతీత పనులు (ఫైల్)

నిరంతరం ఇంతే..

ఈ కాలువలో పూడికతీత పనులను కమిషనర్ ఆధ్వర్యంలో అక్టోబర్ 14న చేపట్టారు. ఈ నెల 10, 11వ తేదీల్లోనూ మరోసారి ప్రక్రియను చేపట్టారు. దీనికి సంబంధించిన ఫొటోలూ కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో భద్రంగా ఉన్నాయి. ప్రస్తుతం ఈ కాలువ ఎంతో శుభ్రంగా ఉండటంతో మురుగు సాఫీగా ప్రవహిస్తోంది. అయితే నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే తన అనుచరుడి కోసం ఇదే కాలువలో పూడికతీత పనులు చేపట్టేందుకు కార్పొరేషన్ అధికారులతో టెండర్‌ను నిర్వహించారు. సదరు ఎమ్మెల్యే అనుచరుడొక్కరే టెండర్ వేయడంతో అతనికే ఖరారైంది.

తూతూమంత్రంగా..

జెట్టి శేషారెడ్డి భవనం నుంచి జాతీయ రహదారి వరకు ఉన్న ఇరిగేషన్ కాలువ పూడికతీత పనుల కోసం రూ.ఐదు లక్షలతో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ తూతూమంత్రంగా చేపట్టి నిధులను స్వాహా చేసేందుకు సిద్ధమయ్యారని తెలుస్తోంది. దీని కోసం అధికారులు సైతం ప్రణాళికలు రూపొందించారు. రోజుల వ్యవధిలోనే నిర్వహించేందుకు సమాయత్తమవుతున్నారని సమాచారం.

నిధుల కేటాయింపు ఇలా..

కాలువ పూడికతీత కోసం 324 మంది ప్రైవేట్ కూలీలను ఏర్పాటు చేసి, ఒక్కొక్కరికీ రోజుకు రూ.700 చొప్పున రూ.2.26 లక్షలు.. గ్లౌజ్‌లతో పాటు ఇతర సేఫ్టీ మెటీరియల్ కోసం రూ.58,320.. కాలువలో తీసిన సిల్ట్‌ను ట్రాక్టర్ ద్వారా తరలించేందుకు రూ.50,400.. పనిచేస్తున్న సమయంలో వర్షమొస్తే నీటిని బయటకు తోడేందుకు రూ.14 వేలు.. పూడిక తీసేందుకు జేసీబీ అద్దెకు రూ.45,600.. హిటాచీ 110 మెషీన్‌కు రూ.23,100.. జీఎస్టీతో కలిపి మొత్తం రూ.ఐదు లక్షలను వెచ్చించేలా టెండర్ ఎస్టిమేషన్‌కు సంబంధించిన నివేదికలో పొందుపర్చారు.

దోచుకున్నోళ్లకు దోచుకున్నంత..!

నగరపాలక సంస్థలోని నిధులను యథేచ్ఛగా దోచుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పలు అభివృద్ధి పనులను చేపడుతున్నామంటూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఖజానా ఖాళీగా ఉందని.. స్థానిక సంస్థలకు ప్రజలు చెల్లిస్తున్న పన్నుల రూపంలో వస్తున్న నిధులతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు వీలుంటుందని రాష్ట్ర పురపాలక మంత్రి అనేక సందర్భాల్లో వెల్లడించారు. అయితే నగరపాలక సంస్థకు వస్తున్న రాబడిని పలువురు అధికారులతో పాటు కొందరు కాంట్రాక్టర్లు స్వాహా చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కార్పొరేషన్ కార్యాలయంలోని రెవెన్యూ విభాగంలో ఏసీల పేరిట నిధులను బొక్కేశారనే వార్తలు ఇటీవల బహిర్గతమయ్యాయి. ఈ విషయమై విచారణ జరపాలంటూ ఇటీవల నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పలువురు కార్పొరేటర్లు అధికారులను డిమాండ్ చేశారు. ఈ రకంగా వ్యవహరిస్తుంటే నగరాభివృద్ధి ఎలా సాధ్యమనే అనుమానం ప్రతి ఒక్కరిలో వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పూర్తి స్థాయిలో విచారణ జరిపి ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.



శుభ్రంగా ఉన్న కాలువ

క్లుప్తంగా

సురేష్‌రెడ్డికి సత్కారం



నెల్లూరు రూరల్: ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డిని బీజేపీ నేతలు ఘనంగా మంగళవారం సత్కరించారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నేత బైరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు బహుమతుల అందజేత



నెల్లూరు సిటీ: ఆర్టీసీ నెల్లూరు ఒకటో డిపో పరిధిలో ప్రయాణించిన వారికి లక్కీడిప్ ద్వారా బహుమతులను డిపో మేనేజర్ మురళీకృష్ణ మంగళవారం అందజేశారు. నెల్లూరు నుంచి బుచ్చిరెడ్డిపాళెం వైపు ప్రయాణించిన మహేష్, రాజేశ్వరి, శ్వేత బహుమతులను సాధించారు.

నిత్యావసర సరుకుల వితరణ



నెల్లూరు (టౌన్): హ్యాండ్స్ టు హ్యాపీనెస్ కార్యక్రమంలో భాగంగా నగరంలోని శాంతి వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులను రత్నం పాఠశాల విద్యార్థులు మంగళవారం అందజేశారు. విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, ఆశ్రమ నిర్వాహకులు విష్ణుప్రియ, ఏఓ తుహీన, జూనియర్ మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపల్ ప్రపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు



మాట్లాడుతున్న స్రవంతి

నెల్లూరు రూరల్: గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని మేయర్ స్రవంతి పేర్కొన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని మంగళవారం సందర్శించిన అనంతరం ఆమె మాట్లాడారు. గ్రంథాలయాల ద్వారా విద్యార్థులకు క్రమశిక్షణ, ఏకాగ్రత ఏర్పడుతుందని తెలిపారు.

నేత్రదానం



రాజ్యలక్ష్మి (ఫైల్)

నెల్లూరు(అర్బన్): ట్రంక్ రోడ్డు సమీపంలోని మోకలవారివీధిలో నివాసం ఉంటున్న రాజ్యలక్ష్మి (48) విద్యుదాఘాతంతో మంగళవారం మృతి చెందారు. ఈ క్రమంలో నేత్రదాన మోటివేటర్ బయ్యా ప్రసాద్ సహకారంతో ఆమె నేత్రాలను నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి కుటుంబసభ్యులు దానం చేశారు. నేత్రాలను ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ టెక్నీషియన్ సునీల్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్రదాన మోటివేటర్ బాలాజీసింగ్ సేకరించారు. అనంతరం సర్టిఫికెట్‌ను కుటుంబసభ్యులకు అందజేశారు. నేత్రదానం చేయాలనుకునే వారు 99595 89321, 93471 11033 నంబర్లను సంప్రదించాలని మోటివేటర్లు కోరారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న కిశోర్‌కుమార్

నెల్లూరు(క్రైమ్): రక్షణ చట్టాలపై బుజబుజనెల్లూరులోని శేషు ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. గుడ్.. బ్యాడ్ టచ్, మత్తు, మాదకద్రవ్యాల వినియోగంతో సంభవించే దుష్పరిణామాలు, ట్రాఫిక్ నిబంధనలు తదితరాలను వివరించారు. అత్యవసర వేళల్లో 112ను సంప్రదిస్తే తగు చర్యలు చేపడతామని చెప్పారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యమైన ఘటనలపై నవాబుపేట పోలీసులు కేసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా కుమ్మెర లక్ష్మీతాండాకు చెందిన కత్రావత్ పుల్యానాయక్ ఉపాధి నిమిత్తం తన కుటుంబంతో కలిసి నగరానికి కొంత కాలం క్రితం వచ్చారు. పెన్నా వద్ద నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి పనులకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఆయన అదృశ్యమయ్యారు. కుటుంబసభ్యులు గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లభించలేదు. దీంతో భార్య భూమిని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పుల్యానాయక్ ఆచూకీ తెలిసిన వారు 94407 96306, 73968 05381 నంబర్లను సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా కోరారు.

- శెట్టిగుంట రోడ్డుకు చెందిన ఓ వివాహిత తన ఇంటి నుంచి ఈ నెల ఐదున అదృశ్యమయ్యారు. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు తల్లి సుజాత ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఊపిరితిత్తులను కాపాడుకుందాం

నెల్లూరు(అర్బన్): ధూమపానం, మద్యం తదితర అలవాట్లకు దూరంగా ఉండటం ద్వారా ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని మెడికవర్ సూపర్ స్పెషాల్టీ పల్మనాలజిస్ట్ లక్ష్మీసుస్మితారెడ్డి, ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ కౌశిక్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ సీఓపీడీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఊపిరితిత్తుల వ్యాధులపై నగరంలోని ఆస్పత్రిలో అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు.

నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



డీఆర్డీఏ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న నాగరాజకుమారి

నెల్లూరు (పొగతోట): విధులకు సమయానికి హాజరుకావాలని, నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని డీఆర్డీఏ పీడీ నాగరాజకుమారి పేర్కొన్నారు. డీఆర్డీఏ కార్యాలయంలోని వివిధ విభాగాలను మంగళవారం పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. విధులకు సిబ్బంది పూర్తిస్థాయిలో హాజరుకావడం లేదని, వచ్చిన వారూ ఇష్టానుసారంగా బయటకెళ్తున్నారని చెప్పారు. ఇలాంటి వాటిని సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

ఫిబ్రవరిలో 'డీకేడబ్ల్యూ' వజ్రోత్సవ వేడుకలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాల వజ్రోత్సవ వేడుకలను ఫిబ్రవరి రెండో వారంలో నిర్వహించనున్నామని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. కళాశాలలో మంగళవారం నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వజ్రోత్సవాల సందర్భంగా సావనీర్‌ను ప్రచురించనున్నామని, పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను dkalumni1964@gmail.comకు పంపాలని కోరారు. వివరాలకు 93987 72966, 99494 05595 నంబర్లను సంప్రదించాలని సూచించారు. ప్రిన్సిపల్ గిరి, పూర్వ విద్యార్థుల సంఘ ప్రెసిడెంట్ జ్యోతిరెడ్డి, సెక్రటరీ కుసుమకుమారి, జాయింట్ సెక్రటరీ జయలక్ష్మి, కోఆర్డినేటర్ కరుణశ్రీ, సభ్యులు రంజని, మమత, రాజేశ్వరి, లలిత, రుక్మిణి, స్వాతి పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి అండగా ఉంటాం



నెల్లూరు(అర్బన్): పడారుపల్లి అర్బన్ హెల్త్ సెంటర్‌లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తూ మృతి చెందిన గండికోట సురేంద్ర కుటుంబానికి అండగా ఉంటామని ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు పేర్కొన్నారు. జాకీర్‌హుస్సేన్‌నగర్‌లో సురేంద్ర కుటుంబసభ్యులను మంగళవారం పరామర్శించారు. పలువురు డాక్టర్లు, వైద్య ఉద్యోగులు ఫోన్ పే ద్వారా సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మృతుడి కుటుంబ ఆర్థిక పరిస్థితిని చూసి కలెక్టర్, డీఎంహెచ్ఓ ఆదుకోవాలని కోరారు. హంస జనరల్ సెక్రటరీ కమల్‌కిరణ్, కోశాధికారి మజరుల్లా, ఉపాధ్యక్షులు నాగరాజు, మురళి, గౌరవ సలహాదారులు అరవ పరిమళ, మహేష్‌కుమార్, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

దేవరపాళెంలో 'పొలం పిలుస్తోంది'



మాట్లాడుతున్న అధికారులు

నెల్లూరు సిటీ: విచక్షణరహితంగా రసాయన ఎరువులను వినియోగిస్తే పంట ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా సాగు ఖర్చు పెరుగుతుందని నెల్లూరు మండల వ్యవసాయాధికారి నాగమోహన్ పేర్కొన్నారు. దేవరపాళెం, కొండ్లపూడి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. సిఫార్సు చేసిన మోతాదులోనే రసాయన ఎరువులను వినియోగించాలని కోరారు. పశుసంవర్థక శాఖ అధికారి సుమలత, ఉద్యానాధికారి రెడ్డి ప్రసూన, ఉద్యాన సహాయకుడు విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ధర్నా జయప్రదానికి పిలుపు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని విద్యుత్ భవన్ వద్ద బుధవారం చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సుమన్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. విద్యుత్ సంస్థలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులు హాజరుకావాలన్నారు.

రెడ్‌క్రాస్‌లో రక్తదానం

నెల్లూరు(అర్బన్): మద్రాస్ బస్టాండ్ సమీపంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంక్‌లో మేనేజింగ్ కమిటీ సభ్యుడు, న్యాయవాది దాసరి రాజేంద్రప్రసాద్ 51వసారి రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ జిల్లా కార్యదర్శి మస్తానయ్య, కో కన్వీనర్ బలరామయ్యనాయుడు, న్యాయవాదులు రామకృష్ణ, కేశవులు, నిరంజన్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

షాపుల నిర్వహణకు ప్రత్యేక కమిటీ

నెల్లూరు(సెంట్రల్): మద్రాస్ బస్టాండ్ సమీపంలోని ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్‌కు అనుబంధంగా ఉన్న కోనేరు షాపుల నిర్వహణపై ప్రత్యేక కమిటీని నియమించనున్నారని సమాచారం. ఇక్కడ దాదాపు 128 షాపులకు గతంలో కొందరు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఈ విషయమై కోర్టును కొందరు ఆశ్రయించారు. సెల్‌ఫోన్ షాపులు, ఫ్యాన్సీ, టిఫిన్ సెంటర్ల ఏర్పాటుకు దరఖాస్తులొచ్చాయని సంబంధిత మార్కెట్ కమిటీ శాఖ అధికారులు గుర్తించారు. దీంతో వీటిని కొంత కాలంగా ఎవరికీ కేటాయించకుండా మూసి ఉన్నారు. తాజాగా కోర్టును కొందరు ఆశ్రయించగా, షాపులకు టెండర్లు వేసేలా తీర్పు వచ్చింది. ఈ క్రమంలో షాపులను అర్హులకు కేటాయించేలా ఏడుగురితో కూడిన కమిటీని నియమించనున్నారని తెలుస్తోంది. కమిటీ నివేదిక ఆధారంగా షాపుల కేటాయింపునకు టెండర్లను ఖరారు చేయనున్నారు.

వేడుకగా చిన్న వెండినంది ఉత్సవం



నెల్లూరు(బృందావనం): కార్తీక మాస ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో చిన్న వెండినంది ఉత్సవాన్ని కనుల పండువగా మంగళవారం నిర్వహించారు. లక్షబిల్వార్చనను జరిపారు. ఉభయకర్తలుగా నందకిశోర్‌రెడ్డి, శ్రీసుధ, మనోజ్‌కుమార్‌రెడ్డి, శ్రీనిత, చలపతిరావు, గాయత్రి, శ్రీహరి, లక్ష్మి దంపతులు వ్యవహరించారు.

కాకాణికి చినజీయర్ ఆశీస్సులు



సోమశిల : సోమశిలలోని పరమానంద ఆశ్రమంలో త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామిని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంగళవారం రాత్రి కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

ఇందిరా గాంధీకి నివాళులు



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని కాంగ్రెస్ పార్టీ నేతలు ఘనంగా మంగళవారం నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బాలసుధాకర్, కోవూరు నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాసులురెడ్డి, నేతలు సంజయ్‌కుమార్, అల్లావుద్దీన్, హుస్సేన్‌బాషా, మల్లికార్జునరెడ్డి, సుబ్బారావు, చంద్రశేఖర్‌రెడ్డి, ఇర్ఫాన్, రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.



గీతామయి వృద్ధాశ్రమంలో..

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధాశ్రమంలో ఇందిరాగాంధీ జయంతిని రత్నమ్మ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు రాచపాళెం రఘు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వృద్ధులకు అన్నదానం చేశారు. మురళీమోహన్‌రాజు, అరవ రాయప్ప, సుందరం, ఖాదర్‌బాషా, ఆశ్రమ నిర్వాహకుడు తమ్మినేని పాండు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పోటీలు



బహుమతులను అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): ప్రపంచ బాలల దినోత్సవాన్ని పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ మందిరంలో నెల్లూరు బాలభవన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. నగరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు వక్తృత్వ, క్విజ్, తదితరాలను జరిపారు. విజేతలకు ప్రోత్సాహక బహుమతులను రోటరీ క్లబ్ సౌత్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీహరి, మల్లికాబేగం అందజేశారు. బాలభవన్ డైరెక్టర్ గోవిందరాజు సుభద్రాదేవి, విశ్రాంత ఉపాధ్యాయులు భారతి, రమణయ్య, సతీష్‌కుమార్, కృష్ణయ్య, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు



మాట్లాడుతున్న సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థలోని పట్టణ ప్రణాళిక విభాగం నిర్దేశించిన నిబంధనలను ఉల్లంఘించి చేపట్టిన భవన నిర్మాణాలపై కఠిన చర్యలు తప్పవని కమిషనర్ సూర్యతేజ స్పష్టం చేశారు. నగరంలోని ఏడో డివిజన్ లక్ష్మీపురం తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. రోడ్డుపై నిర్మాణ సామగ్రిని ఉంచి రాకపోకలకు అడ్డంకిగా ఉన్న ఓ భవనాన్ని గుర్తించి యజమానులకు జరిమానా విధించాలని ఆదేశించారు. అనంతరం ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని పూల మార్కెట్ ప్రాంగణాన్ని తనిఖీ చేశారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి వాహనాలకు అందజేయాలని సూచించారు. ఆత్మకూరు బస్టాండ్ ప్రాంగణాన్ని పరిశీలించి మేనేజర్‌తో మాట్లాడారు. డిపో ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. హరనాథపురంలోని మురుగునీటి శుద్ధి కేంద్ర పనితీరును ఆరాతీశారు. చిల్డ్రన్స్‌పార్క్ సమీపంలో నూతనంగా నిర్మించిన భవనంలో ఏర్పాటు చేసిన ఆస్పత్రిని తనిఖీ చేశారు. నగరపాలక సంస్థ నుంచి అనుమతులు, ట్రేడ్ లైసెన్స్‌ను పొందకపోవడం, ఆస్తి పన్నును చెల్లించకపోవడాన్ని గుర్తించారు. 17వ డివిజన్లో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను పరిశీలించారు. అదనపు కమిషనర్ నందన్, ఎస్ఈ రామ్మోహన్‌రావు, హెల్త్ ఆఫీసర్ చైతన్య, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు తదితరులు పాల్గొన్నారు.